ప్రశాంత్ బాలకృష్ణన్ అజిత్ కృష్ణన్ అంగద్ ప్రతాప్ శుభాంశు శుక్లా

గగన్‌యాన్ వ్యోమగాములు వీరే

- దేశానికి పరిచయం చేసిన ప్రధాని నరేంద్రమోదీ
- ఎయిర్‌ఫోర్స్‌లో సుదీర్ఘ అనుభవం వీరి సొంతం

తిరువనంతపురం, ఫిబ్రవరి 27: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో త్వరలో చేపట్టనున్న గగన్‌యాన్ యాత్ర ద్వారా అంతరిక్షంలోకి వెళ్లే వ్యోమగాములను ప్రధాని నరేంద్రమోదీ దేశానికి పరిచయం చేశారు. తుంబాలోని విక్రమ్ సారాబాయి స్పేస్ సెంటర్ (బీఎస్ఎస్సీ)లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వ్యోమగాములుగా శిక్షణ పొందుతున్న ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారులు కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, అంగద్ ప్రతాప్, అజిత్ కృష్ణన్, వింగ్ కమాండర్ శుభాంశు శుక్లాను పరిచయం చేశారు. 140 కోట్ల భారతీయుల ఆకాంక్షలకు ఈ నలుగురు ప్రతినిధులని కొనియాడారు. 'ఇది మన సమయం.. రాకెట్ కూడా మనదే. వీరు (వ్యోమగాములు) నలుగురు వ్యక్తులు కాదు.. నాలుగు శక్తులు' అని వ్యాఖ్యానించారు. గగన్‌యాన్‌లోని కీలకమైన పరికరాలన్నీ దేశీయంగానే తయారుచేయటం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. అంతరిక్ష రంగంలో భారత్ సాధిస్తున్న ప్రగతి దేశంలోని యువతకు గొప్ప అవకాశాలను సృష్టించటమేకాక దేశాన్ని 21వ శతాబ్దంలో గొప్ప ప్రపంచ శక్తిగా నిలబెట్టిందని పేర్కొన్నారు. మొదటి ప్రయత్నంలోనే అంగారకుడిని చేరిన అతికొద్ది దేశాల్లో భారత్ ఒకటని, ఒకే రాకెట్‌తో వంద ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపిన ఘనత కూడా భారత్ సొంతమని గుర్తుచేశారు. బంగారు భవిష్యత్తుకు ఇస్రో బృందం తలుపులు తెరిచిందని కొనియాడారు.

గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్

నాయర్ కేరళలోని తురువేజియాడ్‌లో 1976 ఆగస్టు 26న జన్మించారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్డీయే)లో శిక్షణ తీసుకొన్నారు. ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో స్వార్డ్ ఆఫ్ హానర్ అందుకొన్నారు. 1998 డిసెంబర్ 19న ఐఏఎఫ్‌లో చేరారు. ఎస్‌యూ 30 ఎంకేఐ, మిగ్-21, మిగ్-29, హాక్, డోర్నియర్, ఏఎన్-32 తదితర యుద్ధ విమానాలను నడిపిన అనుభవం ఆయనకు ఉన్నది. 'ఏ' క్యాటగిరి ఫ్లైయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా పని చేశారు. యుద్ధవిమానాలను 3000 గంటలపాటు నడిపిన అనుభవం ఉన్నది. ఈయన యునైటెడ్ స్టేట్స్ స్టాఫ్ కాలేజీ పూర్వ విద్యార్థి. వెల్లింగ్టన్‌లోని డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజీలో డైరెక్టింగ్ స్టాఫ్‌గా పనిచేశారు.

గ్రూప్ కెప్టెన్ అజిత్ కృష్ణన్

అజిత్ కృష్ణన్ తమిళనాడులోని చెన్నైలో 1982, ఏప్రిల్ 19న జన్మించారు. ఎన్డీయేలో శిక్షణ తీసుకొన్నారు. రాష్ట్రపతి మెడల్ అందుకొన్నారు. ఐఏఎఫ్‌లో స్వార్డ్ ఆఫ్ హానర్ అందుకొన్నారు. ఐఏఎఫ్ ఫైటర్ స్ట్రీమ్‌లో 2003, జూన్ 21న చేరారు. ఎస్‌యూ-30 ఎంకేఐ, మిగ్-21, మిగ్-29, జాగ్వార్, డోర్నియర్, ఏఎన్-32 తదితర విమానాలను 2,900 గంటలపాటు నడిపిన అనుభవం ఈయనకు ఉన్నది. ఈయన కూడా వెల్లింగ్టన్‌లోని డీఎస్ఎస్సీ పూర్వ విద్యార్థి.

గ్రూప్ కెప్టెన్ ప్రతాప్

ప్రతాప్ ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో 1982 జూలై 17న జన్మించారు. ఎన్డీయేలో శిక్షణ తీసుకొన్నారు. 2004, డిసెంబర్ 18న ఐఏఎఫ్‌లో చేరారు. ఎస్‌యూ-30 ఎంకేఐ, మిగ్-29, జాగ్వార్, హాక్, డోర్నియర్, ఏఎన్-332 తదితర విమానాలను 2000 గంటల పాటు నడిపిన అనుభవం ఉన్నది.

వింగ్ కమాండర్ శుక్లా

శుక్లా లక్నోలో 1985 అక్టోబర్ 10న జన్మించారు. 2006, జూన్ 17న ఐఏఎఫ్‌లో చేరారు. ఫైటర్ కంబాట్ లీడర్‌గా, టెస్ట్ పైలట్‌గా ఈయనకు 2000 గంటల పాటు వివిధ రకాల యుద్ధ విమానాలు నడిపిన అనుభవం ఉన్నది.

క్యాన్సర్ గోలీమార్!

పదేండ్ల శ్రమకు ఫలితం.. క్యాన్సర్ చికిత్సలో మైలురాయి

అరుదైన గోలీని అభివృద్ధి చేసిన టాటా పరిశోధకులు

ఎలుకలపై జరిపిన ప్రయోగాల్లో సానుకూల ఫలితాలు

సైడ్ ఎఫెక్ట్స్ కూడా సగం వరకూ తగ్గుతాయని వెల్లడి

జూన్ నాటికి మార్కెట్లోకి గోలీ.. ధర రూ. 100

కడవేర్గు రాజశేఖర్
(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): వివిధ క్యాన్సర్లతో ప్రపంచంలో ఏటా కోటి మంది మృత్యువాత పడుతున్నారు. ప్రతీ ఆరు మరణాల్లో ఒకటి క్యాన్సర్‌దే కావడం ఆందోళన కలిగిస్తున్నది. రేడియేషన్ థెరపీ, కీమో థెరపీ, సర్జరీ తదితర ప్రక్రియలతో క్యాన్సర్‌ను కట్టడి చేస్తున్నప్పటికీ, ఆ మహమ్మారి తిరగబెడుతుండటంతో మరణాల సంఖ్య అంతకంతకూ పెరిగిపోతున్నది. అయితే, తిరగబెట్టే క్యాన్సర్లను కూడా అరికట్టడానికి ముంబైలోని టాటా మెమోరియల్ సెంటర్ ఫర్ క్యాన్సర్ రిసెర్చ్ అండ్ ట్రీట్మెంట్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు ఓ అరుదైన గోలీని అభివృద్ధి చేశారు. ఈ గోలీతో మళ్లీ క్యాన్సర్ తిరగబెట్టే అవకాశం ఉండదని వాళ్లు చెబుతున్నారు. క్యాన్సర్ చికిత్సలో ఇదో గొప్ప మైలురాయిగా అభివర్ణిస్తున్నారు.

ఎలా పనిచేస్తుంది?

క్యాన్సర్ చికిత్సలో భాగంగా జరిపే రేడియేషన్ థెరపీ, కీమోథెరపీ, సర్జరీలో లక్షిత క్యాన్సర్ కణాలను విచ్ఛిన్నం చేసి మహమ్మారిని క్రమంగా తగ్గుముఖం పట్టించే ప్రయత్నం చేస్తారు. అయితే, విచ్ఛిన్నమైన ఈ కణాలు (వీటిని క్రొమాటిన్ కణాలుగా పిలుస్తారు) రక్తం ద్వారా శరీరంలోని ఇతర అవయవాలకు చేరి అక్కడి ఆరోగ్యకరమైన కణాల్లోకి చేరుతాయి. ఆలా ఆయా భాగాల్లో గడ్డలను ఏర్పాటు చేసి క్యాన్సర్‌ను తిరగబెడతాయి. అయితే, టాటా పరిశోధకులు తాజాగా అభివృద్ధి చేసిన ఈ గోలీ.. రక్తంలోకి చేరగానే, క్రొమాటిన్ కణాలను పూర్తిగా నాశనం చేస్తుంది. తద్వారా క్యాన్సర్‌ను తిరగబెట్టకుండా అడ్డుకొంటుంది. అంతేకాదు, క్యాన్సర్ చికిత్సలో భాగంగా తీసుకొనే రేడియేషన్ థెరపీ, కీమోథెరపీతో పాటు ఈ గోలీని తీసుకొంటే థెరపీలో భాగంగా ఎదురయ్యే సైడ్ ఎఫెక్ట్స్ 50 శాతం మేర తగ్గుతాయని పరిశోధకులు తెలిపారు.



డాక్టర్ రాజేంద్ర బాడ్వే

రూ. 100కే అందుబాటులోకి

క్యాన్సర్ కణాలను ఇంజెక్ట్ చేసిన ఎలుకల్లో తొలుత ఈ గోలీని ప్రయోగించగా సానుకూల ఫలితాలు వచ్చినట్టు పరిశోధనలలో భాగమైన వైద్యుడు డాక్టర్ రాజేంద్ర బాడ్వే తెలిపారు. సైడ్ ఎఫెక్ట్స్‌కు సంబంధించిన ప్రయోగాలు ఎలుకలతో పాటు మనుషులపై కూడా చేశామని అన్నారు. అయితే తిరగబెట్టే క్యాన్సర్ కట్టడి ప్రయోగాలు ప్రస్తుతానికి ఎలుకల్లోనే చేపట్టామని, అందులో సానుకూల ఫలితాలు వచ్చినట్టు పేర్కొన్నారు. ఇవే ప్రయోగాలు మనుషులపై చేయాలంటే మరో ఐదేండ్లు పట్టొచ్చని వెల్లడించారు. అయినప్పటికీ, ఈ డ్రగ్‌కు ఆమోదం కోసం ఇప్పటికే ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ)కి దరఖాస్తు చేసుకొన్నట్టు చెప్పారు. అనుమతులు లభిస్తే, వచ్చే జూన్-జూలై నాటికి మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకరానున్నట్టు వెల్లడించారు. క్యాన్సర్ చికిత్సకు రూ. లక్షల్లో ఖర్చు అవుతున్నప్పటికీ, తాము ఈ గోలీని రూ. 100కే అందుబాటులోకి తీసుకురానున్నట్టు వివరించారు.

పదేండ్ల పాటు పరిశోధనలు

ఈ డ్రగ్ అభివృద్ధి కోసం పదేండ్ల పాటు పరిశోధనలు నిర్వహించినట్టు బాడ్వే తెలిపారు. ఈ పరిశోధనలతో సమయం, డబ్బు వృథా అవుతున్నదా? అనే అనుమానాలు తొలుత బృంద సభ్యులకు కలిగినా.. చివరకు సానుకూల ఫలితాలు దక్కడంతో అందరం సంతోషంగా ఉన్నట్టు ఆయన సంబురపడ్డారు. క్యాన్సర్ చికిత్సలో ఈ గోలీ ఓ గొప్ప మైలురాయిగా అభివర్ణించారు.

కేంద్ర శాఖల్లో 2049 పోస్టులు

నమస్తే తెలంగాణ (ఎడ్యుకేషన్ డెస్క్): స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్సీ) సెలక్షన్ పోస్టుల నియామక పరీక్ష (ఫేజ్-XII/2024)కు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖల్లోని పలు విభాగాల్లో ఖాళీగా ఉన్న 2049 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టుల్లో ఎస్సీ- 255, ఎస్టీ-124, ఓబీసీ- 456, యూఆర్-1028, ఈడబ్ల్యూఎస్- 186 కేటాయించారు. పోస్టును బట్టి 10, 12 తరగతులు, డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసిన వారు ఈ పోస్టులకు అర్హులు. అర్హత ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రాత పరీక్ష, స్కిల్ టెస్ట్ ద్వారా ఎంపిక చేస్తారు. దరఖాస్తులు ప్రారంభమయ్యాయి. చివరితేదీ మార్చి 18. మరిన్ని వివరాలు https://ssc.nic.in వెబ్‌సైట్ లో చూడవచ్చు. కేంద్ర ప్రభుత్వ వివిధ శాఖల్లో లైబ్రరీ అటెండెంట్, మెడికల్ అటెండెంట్, నర్సింగ్ ఆఫీసర్, ఫార్మసిస్ట్ ఫీల్డ్‌మ్యాన్, అకౌంటెంట్, అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్, ల్యాబొరేటరీ అటెండెంట్, ఫోర్‌మ్యాన్, జూనియర్ ఇంజినీర్, యూడీసీ, డ్రైవర్ కమ్ మెకానిక్, టెక్నికల్ అసిస్టెంట్, సూపర్‌వైజర్, సీనియర్ ట్రాన్స్‌లేటర్, రీసెర్చ్ ఇన్వెస్టిగేటర్, కోర్ట్ క్లర్క్, సీనియర్ జియోగ్రాఫర్..మొదలైన ఉద్యోగ ఖాళీలు ఉన్నాయి.

సెకండ్ క్లాస్ ఆర్డినరీ చార్జీల పునరుద్ధరణ

ప్రయాణికులకు రైల్వే శాఖ ఊరట

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: రైల్వే ప్రయాణికులకు శుభవార్త. ప్రధానంగా ప్యాసెంజర్ రైళ్లలో ప్రయాణాలు సాగించే చిరు వ్యాపారులు, రోజువారీ కూలీలు, పేదలకు చార్జీల విషయంలో ఊరట కల్పించేలా రైల్వే శాఖ నిర్ణయం తీసుకొన్నది. ఎక్స్‌ప్రెస్ స్పెషల్స్‌గా మార్చిన ప్యాసెంజర్ రైళ్లలో సెకండ్ క్లాస్ ఆర్డినరీ చార్జీలను గతంలో ఉన్నమాదిరిగా కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించింది. మంగళవారం ఉదయం నుంచే పాత ఆర్డినరీ చార్జీలు అమల్లోకి వచ్చాయి. కొవిడ్ లాక్‌డౌన్ తర్వాత రైల్వే శాఖ పేర్లను మార్చడం ద్వారా ప్యాసెంజర్ రైళ్లను క్రమంగా ఉపసంహరించింది. దీంతో ఆర్డినరీ క్లాస్‌లో కనీస చార్జి ఎక్స్‌ప్రెస్ రైళ్ల ధరలకు సమానంగా రూ.10 నుంచి రూ.30లకు చేర్చడంపై పెద్దయెత్తున విమర్శలు వచ్చాయి. సమీక్షా సమావేశం నిర్వహించిన రైల్వే బోర్డు.. సెకండ్ క్లాస్ ఆర్డినరీ కనీస చార్జీలను పాత విధానంలోనే వసూలు చేయాలని చీఫ్ బుకింగ్ రిజర్వేషన్ సూపర్‌వైజర్లకు సమాచారం అందజేసింది. దీని ప్రకారం 'మెయిన్ లైన్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్' (మెమూ) రైళ్ల ఆర్డినరీ క్లాస్ టికెట్ ధరలు 50 శాతం వరకు తగ్గాయి. యూటీఎస్ యాప్‌లోనూ కొత్త ఈ చార్జీలను అప్‌డేట్ చేశారు.

హిమాచల్‌లో కాంగ్రెస్‌కు షాక్

- కొంపముంచిన క్రాస్ ఓటింగ్
- రాజ్యసభ ఎన్నికల్లో కమలానికి ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఓటు
- ఫలితం టై.. టాస్‌లో నెగ్గిన బీజేపీ
- కర్ణాటకలో కాంగ్రెస్‌కు 3, కమలానికి 1
- యూపీలో బీజేపీకి 8, ఎస్పీకి 2 సీట్లు

ఓటమి తర్వాత మీడియాతో మాట్లాడుతున్న సింఘ్వీ, పక్కన హిమాచల్ సీఎం సుఖ్విందర్

బెంగళూరు/లక్నో, ఫిబ్రవరి 27: హిమాచల్ ప్రదేశ్‌లో అధికార కాంగ్రెస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలోని ఏకైక రాజ్యసభ సీటుకు జరిగిన ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ కాంగ్రెస్ కొంపముంచింది. ఆరుగురు పార్టీ ఎమ్మెల్యేలు బీజేపీకి ఓటు వేయడంతో రాజ్యసభ సీటు 'చే'జారింది. ఇరు పార్టీల అభ్యర్థులకు చెరో 34 ఓట్లు రాగా, ఫలితం తేల్చేందుకు టాస్ వేయగా అదృష్టం బీజేపీని వరించింది. దీంతో కాంగ్రెస్ అగ్రనేత అభిషేక్ మనుసింఘ్వీపై బీజేపీ అభ్యర్థి హర్ష్ మహాజన్ విజయం సాధించారు. దేశవ్యాప్తంగా మూడు రాష్ట్రాల్లోని 15 స్థానాలకు మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. క్రాస్ ఓటింగ్ అభ్యర్థుల ఫలితాలను తారుమారు చేశాయి. కర్ణాటకలో మొత్తం నాలుగు స్థానాలకు గానూ అధికార కాంగ్రెస్ 3, బీజేపీ ఒక సీటును గెలుచుకున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో మొత్తం 10 స్థానాలకు గానూ అధికార బీజేపీ 8 సీట్లు కైవసం చేసుకోగా, సమాజ్‌వాదీ పార్టీ రెండు సీట్లను గెలుచుకుంది.

కర్ణాటకలో కమలానికి గట్టిదెబ్బ

కర్ణాటకలోని కమలం పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. బీజేపీకి ఇద్దరు ఎమ్మెల్యేలు షాక్ ఇచ్చారు. ఎమ్మెల్యే ఎస్‌టీ సోమశేఖర్ కాంగ్రెస్ అభ్యర్థి అజయ్ మాకెన్‌కు ఓటు వేయగా.. మరో ఎమ్మెల్యే శివరామ్ ఓటింగ్‌కు రాలేదు.

ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ జోష్

యూపీలో 10 రాజ్యసభ స్థానాలకు జరిగిన పోలింగ్‌లో బీజేపీ 8 స్థానాల్లో విజయం సాధించగా.. ఎన్నికల్లో భారీగా క్రాస్ ఓటింగ్ జరిగింది. బీజేపీ తరపున కేంద్ర మంత్రి ఆర్పీ సింగ్, మాజీ ఎంపీ చౌదరి తేజ్వీర్ సింగ్, యూపీ బీజేపీ ప్రధాన కార్యదర్శి అమర్‌పాల్ మౌర్య, రాష్ట్ర మాజీ మంత్రి సంగీతా బల్వంత్, పార్టీ అధికార ప్రతినిధి సుధాన్షు త్రివేది, మాజీ ఎమ్మెల్యే సాధనా సింగ్, ఆగ్రా మాజీ మేయర్ నవీన్ జైన్, పారిశ్రామిక వేత్త సంజయ్ సేథ్ గెలుపొందారు. ఇక సమాజ్‌వాదీ పార్టీ తరపున సినీ నటి జయాబచ్చన్, దళిత నేత రామ్‌జీ లాల్ సుమన్ ఎన్నికయ్యారు. 41 మంది సభ్యులు జయకు ఓటేయటంతో ఆమెకు అత్యధిక ఓట్లు లభించాయి.

హైడ్రామా నడుమ పోలింగ్

యూపీలో హైడ్రామా జరిగింది. ఓ వైపు క్రాస్ ఓటింగ్ ఆందోళన రేగుతుండగానే సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ విప్ మనోజ్‌పాండే రాజీనామా చేశారు. అంతకుముందు సోమవారం అఖిలేశ్ యాదవ్ సమావేశానికి 8 మంది ఎస్పీ ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. సంఖ్యాబలం ప్రకారం బీజేపీ 7, ఎస్పీ 3 రాజ్యసభ సీట్లను గెలుచుకునే ఆస్కారం ఉన్నది. అయితే బీజేపీ ఎనిమిదో అభ్యర్థిని నిలబెట్టటంతో పోటీ రసవత్తరంగా మారింది. చివరకు క్రాస్ ఓటింగ్‌తో బీజేపీ 8 సీట్లను కైవసం చేసుకున్నది.

పతనం అంచున హిమాచల్ సర్కార్

మొదటిపేజీ తరువాయి...

నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు ప్రతిపక్ష బీజేపీ సిద్ధమవుతున్నట్టు తెలుస్తున్నది. మరికొంత మంది ఎమ్మెల్యేలను కమలం పార్టీ తమవైపునకు తిప్పుకొంటే.. కాంగ్రెస్ సర్కార్ కుప్పకూలే అవకాశం ఉన్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అంతకుముందు అసెంబ్లీలో బీజేపీ పక్ష నేత, మాజీ సీఎం జైరాం ఠాకూర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మెజార్టీ కోల్పోయిందని, సీఎం సుఖ్విందర్ సింగ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

హిమాచల్ అసెంబ్లీ స్థానాలు- 68 (మెజార్టీ-35)

రాజ్యసభ ఎన్నికలకు ముందు		రాజ్యసభ ఎన్నికలకు తర్వాత	
కాంగ్రెస్	40	కాంగ్రెస్	34
బీజేపీ	25	బీజేపీ	25
స్వతంత్రులు	3	కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పడిన ఓట్లు	9

కంటి చూపుతో కారు డ్రైవింగ్!

- మొబైల్ కూడా ఆపరేట్ చేయొచ్చు
- ఐ ట్రాకింగ్ టెక్నాలజీతో ఇది సులువే
- 'మ్యాజిక్ 6 ప్రో' పేరిట ఐ ట్రాకింగ్ టెక్నాలజీ ఫోన్లను తీసుకొచ్చిన హానర్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): 'సెవెన్త్ సెన్స్' సినిమా చూశారా? ఆ చిత్రంలో విలన్ పాత్రధారి తన కండ్లతో తీక్షణంగా చూసి ఎదుటివారిని పూర్తిగా తన ఆధీనంలోకి తెచ్చుకొంటాడు. అచ్చం అలాగే కంటితో చూసి కారును డ్రైవ్ చేస్తే ఎలా ఉంటుంది? వాషింగ్ మెషీన్‌ను, మొబైల్‌ను కూడా కండ్లతోనే ఆపరేట్ చేస్తే బాగుంటుంది కదూ. 'ఐ ట్రాకింగ్ టెక్నాలజీ'తో ఇప్పుడు ఇవన్నీ సాధ్యమే. ప్రముఖ టెక్ కంపెనీ హానర్.. ఐ ట్రాకింగ్ టెక్నాలజీతో పనిచేసే వినూత్న స్మార్ట్‌ఫోన్ 'మ్యాజిక్ 6 ప్రో'ను తాజాగా తీసుకొచ్చింది. బార్సిలోనాలో జరుగుతున్న మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ (ఎండబ్ల్యూసీ)లో ఈ మేరకు ఓ ప్రదర్శనను కూడా ఇచ్చింది. ఈ క్రమంలో 'ఐ ట్రాకింగ్ టెక్నాలజీ' గురించి సర్వత్రా చర్చ జరుగుతున్నది.

ఎలా పనిచేస్తుంది?

'ఐ ట్రాకింగ్ టెక్నాలజీ'ని వినియోగించాలంటే ముందుగా ఏదైనా ఫోన్‌లో దానికి సంబంధించిన యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఆ క్షణం నుంచి సదరు ఫోన్ 'ఐ ట్రాకింగ్ టెక్నాలజీ' పరిధిలోకి వచ్చినట్టే. ఏదైనా ఫోన్ కాల్ వచ్చినప్పుడు మనం ఫోన్ స్క్రీన్‌పై కనిపించే రెడ్ బటన్ (డిక్లైన్ కాల్) లేదా గ్రీన్ బటన్ (యాక్సెప్ట్ కాల్) వైపునకు చూస్తే చాలు.. మొబైల్ కెమెరా మన కంటిపాపను విశ్లేషించి మనం ఏ బటన్‌ను చూశామో దాన్ని ఆన్ చేస్తుంది. అంతే కాదు.. ఫోన్‌లో ఉన్న మెనూలో ఏ యాప్ తెరవాలి? ఏమేం షాపింగ్ చేయాలి? వంటి పనులను కూడా చక్కబెడుతుంది. ఫోన్‌ను బ్లూటూత్‌తో కారుకు లేదా వాషింగ్ మెషీన్, టీవీకి అనుసంధానం చేస్తే చాలు.. ఫోన్ కెమెరా ద్వారా కంటిపాప ఆదేశాలను బట్టి ఆయా డివైజ్‌లను కూడా సులభంగా ఆపరేట్ చేయవచ్చు. తాజాగా తీసుకొచ్చిన 'మ్యాజిక్ 6 ప్రో' స్మార్ట్ ఫోన్‌లో ఈ ఫీచర్లన్నీ పొందుపరిచినట్టు హానర్ కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

ఏమిటీ 'ఐ ట్రాకింగ్ టెక్నాలజీ'?

> చేతులతో, వాయిస్ కమాండ్‌తో కాకుండా కండ్లలోని కనుపాప సాయం తో డివైజ్‌లను ఆపరేట్ చేసే సరికొత్త కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతనే 'ఐ ట్రాకింగ్ టెక్నాలజీ'గా పిలుస్తున్నారు.

లోక్‌పాల్ చైర్‌పర్సన్‌గా జస్టిస్ ఖాన్విల్కర్

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: అవినీతి నిరోధక అంబుడ్స్‌మెన్ 'లోక్‌పాల్' చైర్‌పర్సన్‌గా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్ నియమితులయ్యారు. లోక్‌పాల్ చీఫ్, సభ్యుల ఎంపికపై ప్రధాని మోదీ నేతృత్వంలోని కమిటీ సిఫారసులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఆమోదముద్ర వేశారు. ఈ మేరకు రాష్ట్రపతి కార్యాలయం నుంచి అధికారిక ప్రకటన విడుదలైంది. జస్టిస్ ఖాన్విల్కర్ సుప్రీంకోర్టు జడ్జిగా 2022 జూలైలో రిటైర్ అయ్యారు. రిటైర్డ్ న్యాయమూర్తులు జస్టిస్ లింగప్ప నారాయణస్వామి, జస్టిస్ సంజయ్ యాదవ్, జస్టిస్ రితురాజ్ అవస్థీ.. జ్యుడిషియల్ సభ్యులుగా, సుశీల్ చంద్ర, పంకజ్‌కుమార్, అజయ్ టిర్కీ నాన్-జ్యుడిషియల్ సభ్యులుగా నియమితులయ్యారు. లోక్‌పాల్ చీఫ్‌గా జస్టిస్ పినాకి చంద్రఘోష్ పదవీకాలం 2022 మే 27న ముగిసిన తర్వాత.. రెండేండ్లుగా చైర్‌పర్సన్ పదవి ఖాళీగా ఉండిపోయింది. ఇంతకాలం తాత్కాలిక చైర్‌పర్సన్‌గా లోక్‌పాల్ సభ్యులు జస్టిస్ ప్రదీప్ కుమార్ మెహంతీ కొనసాగారు.



వచ్చే నెల నుంచి సీఏఏ!

రిజిస్ట్రేషన్లకు ఆన్‌లైన్ పోర్టల్ • హోంశాఖ ట్రయల్ రన్స్ • లోక్‌సభ ఎన్నికల ముంగిట తెరపైకి వివాదాస్పద చట్టం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: లోక్‌సభ ఎన్నికల ముంగిట వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) అమలు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. గత నాలుగు సంవత్సరాలుగా వాయిదా పడుతూ వస్తున్న ఈ చట్టం అమలుకు సంబంధించిన నిబంధనల రూపకల్పన ఎట్టకేలకు పూర్తయిందని, వచ్చే నెల నుంచి దేశవ్యాప్తంగా సీఏఏను కేంద్రం అమలు చేస్తుందని ప్రభుత్వ వర్గాలు తాజాగా వెల్లడించాయి. పౌరసత్వ నమోదు కోసం ఆన్‌లైన్ పోర్టల్ కూడా సిద్ధమైందని, కేంద్ర హోంశాఖ ఇప్పటికే రిజిస్ట్రేషన్లకు సంబంధించి ట్రయల్ రన్స్ నిర్వహించిందని తెలిపాయి. దీర్ఘకాలిక వీసా కోసం హోంశాఖ వద్దకు వచ్చిన దరఖాస్తులకు అధిక శాతం పాకిస్థానీయుల నుంచే వచ్చాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. లాంగ్ టర్మ్ వీసాలను మంజూరు చేసే అధికారాన్ని కేంద్రం ఇప్పటికే తొమ్మిది రాష్ట్రాల్లోని 30 జిల్లాల మేజిస్ట్రేట్‌లకు అప్పగించింది.

ఏమిటీ సీఏఏ?

పౌరసత్వ సవరణ చట్టాన్ని 2019, డిసెంబర్‌లో కేంద్రం తీసుకొచ్చింది. మత పరమైన హింస కారణంగా 2014, డిసెంబర్ 31 కంటే ముందు పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్ నుంచి భారత్‌కు వలస వచ్చిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు, క్రిస్టియన్ మతస్తులకు పౌరసత్వం ఇచ్చేందుకు ఈ చట్టాన్ని తీసుకొచ్చారు. అయితే సీఏఏ నిబంధనలు ఇప్పటి వరకు ఖరారు కాలేదు.

అభ్యంతరాలు ఏంటి?

1955 పౌరసత్వ చట్టాన్ని సవరిస్తూ తీసుకొచ్చిన కొత్త చట్టంలో ముస్లింలను మినహాయించడం వివాదానికి దారితీసింది. ఈశాన్య రాష్ట్రాల్లో పెద్దయెత్తున ఆందోళనలు జరిగాయి. ముస్లిం ఆధిపత్య దేశాల్లో మత హింస కారణంగా దేశంలోకి వలస వచ్చిన ముస్లిమేతరులకు ఈ పౌరసత్వ సవరణ చట్టం ఉపయోగపడుతుందని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నది. అయితే ఈ చట్టం ముస్లింల పట్ల వివక్ష చూపుతున్నదని, రాజ్యాంగ లౌకిక సూత్రాలకు తూట్లు పొడుస్తున్నదని విపక్షాలు విమర్శిస్తున్నాయి.

మా రాష్ట్రాల్లో అమలు చేయబోం!

పౌరసత్వ సవరణ చట్టాన్ని పలు రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. తమ రాష్ట్రాల్లో సీఏఏను అమలు చేసేది లేదని తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల సీఎంలు తెగేసి చెబుతున్నారు. సీఏఏను తమిళనాడులో అసలు అమలు చేయబోమని సీఎం ఎంకే స్టాలిన్ ఇటీవల స్పష్టం చేశారు. 'ముస్లింలు, శ్రీలంక తమిళుల గురించి పట్టించుకోకుండా ఈ చట్టాన్ని రూపొందించారు.చట్టాన్ని అమలు చేయబోం' అని ఆయన పేర్కొన్నారు. సీఏఏను అమలు చేయరాదనే వైఖరికి కేరళ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని సీఎం విజయన్ ఓ సందర్భంగా స్పష్టం చేశారు. భారత్‌ను మతపరమైన దేశంగా మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు.

కేజ్రీవాల్‌కు ఎనిమిదోసారి ఈడీ సమన్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఈడీ ఎనిమిదోసారి సమన్లు జారీచేసింది. మార్చి 4న తమ ఎదుట విచారణకు రావాలని కోరింది. ఈ కేసులో ఈడీ ఇప్పటికే ఏడుసార్లు సమన్లు జారీచేసినప్పటికీ కేజ్రీవాల్ హాజరుకాలేదు. విషయం కోర్టు పరిధిలో ఉన్నందున, ఈడీ పదే పదే సమన్లు జారీచేయడం తగదని, కోర్టు ఆదేశిస్తే తాను విచారణకు హాజరవుతానని కేజ్రీవాల్ స్పష్టంచేశారు.

లోక్‌సభ బరిలో నిర్మల, జై శంకర్

కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడి

హుబ్బళ్లి, ఫిబ్రవరి 27: కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, జై శంకర్ త్వరలో జరిగే లోక్